క్లుప్తంగా

ఖజానా ఉద్యోగులకు సహకరిస్తాం

● ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ మాగుంట

ఒంగోలు టౌన్: ఖజానా శాఖ ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేస్తామని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి తెలిపారు. గురువారం ఆయన ఖజానా అసోసియేషన్ 2025 సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రజలు, ఉద్యోగులంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నానని చెప్పారు. కార్యక్రమంలో ఏపీటీఏఎస్ఏ రాష్ట్ర కార్యదర్శి షేక్ అబ్దుల్ ఖాదర్, పీవీ నారాయణ, కేవీ కెనడీ, విజయ్ కుమార్, ఎస్.కొండలరావు, ఎం.వెంకటేశ్వర్లు, డార్విన్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

నాగులుప్పలపాడు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగరాజు, శ్రీదేవి, ఉషారాణి అన్నారు. మండలంలోని అమ్మనబ్రోలు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం కిషోర బాల వికాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ యజ్ఞేంద్రబాబు మాట్లాడుతూ చిన్నారులు పనికి వెళ్లకుండా బడికి వెళ్లి చక్కగా చదువుకోవాలని సూచించారు. అందుకు ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తుందన్నారు. అనంతరం బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

రెవెన్యూ సదస్సుకు 97 అర్జీలు


సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ మధుసూదన్‌రావు

కొత్తపట్నం: మండలంలో బీరంగుంట, పిన్నివారిపాలెంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 92 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ పి.మధుసూదన్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూసమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం గ్రామ సభలు ఏర్పాటు చేసిందన్నారు. సర్టిఫికెట్ల అర్జీల్లో కొన్ని అక్కడికక్కడే పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ వరప్రసాద్, వీఆర్వోలు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

గిద్దలూరు రూరల్: ఆర్యవైశ్య పేద విద్యార్థులకు ప్రతిభా ఉపకార వేతనం అందించేందుకు ఈ నెల 8 నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వాసవీ ఆర్యవైశ్య పేద విద్యార్థుల సేవా సంస్థ నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని ఆర్యవైశ్య విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల కోసం అమ్మవారిశాలలోని నిర్వాహకులను సంప్రదించాలని తెలిపారు.

భక్తి శ్రద్ధలతో వెంకటేశ్వర స్వామి కల్యాణం

మార్కాపురం రూరల్: మార్కాపురం పట్టణ శివారులోని గుండ్లకమ్మ నది ఒడ్డు సమీపంలో జంకె రామిరెడ్డి నగర్‌లో ఉన్న శ్రీలక్ష్మి పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం శ్రవణా నక్షత్రం సందర్భంగా స్వామివారి కల్యాణాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పలువురు భక్తులు హాజరై కల్యాణోత్సవంలో పాల్గొని స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అధ్యక్ష కార్యదర్శులు చక్కా మాలకొండ నరసింహారావు, ఊటుకూరి రామకృష్ణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పరికరాలు సద్వినియోగం చేసుకోవాలి

రాచర్ల: రైతు సేవా కేంద్రాలకు ఇచ్చిన వివిధ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కనిగిరి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఈవీ రమణ సూచించారు. మండలంలోని సోమిదేవిపల్లె, అనుమలవీడు, రాచర్ల, గంగంపల్లె, చినగానిపల్లె గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల ద్వారా సబ్సిడిపై తీసుకున్న పరికరాలు రైతులు వినియోగించుకుంటున్నారా..లేదా అనే విషయంపై గురువారం తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి షేక్.అబ్దుల్ రఫీక్, రైతులు పాల్గొన్నారు.



మంచు దొంతర

దట్టమైన పొగమంచు ఒంగోలు నగరాన్ని కప్పేసింది. చలి తీవ్రత పెరగడంతోపాటు ఉదయం 10 గంటల వరకు మంచు తెరలు వీడకపోవడంతో నగర వాసులు కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాహనాల రాకపోకలు నెమ్మదిగా సాగాయి.

- సాక్షి, ఒంగోలు

భూ సమస్యలకు పరిష్కారమేదీ?

కొత్తపట్నం: రెవెన్యూ సమస్యలు నామమాత్రంగానే జరుపుతున్నారని, భూ సమస్యలు అలాగే మిగిలిపోతున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి జీవి కొండారెడ్డి విమర్శించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. కోమట్ల భాగ్యలక్ష్మి అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో కొండారెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు దఫాలుగా రెవెన్యూ సదస్సులు నిర్వహించినా భూసమస్యలు పరిష్కరించలేదని మండిపడ్డారు. కొన్ని రకాల సర్టిఫికెట్ల జారీకే పరిమితమై భూ సమస్యలను గాలికొదిలేశారని విమర్శించారు. రైతులకు సంబంధించిన అనేక సమస్యలు నేటికీ పరిష్కారం కాలేదన్నారు. భూమి లేని వ్యవసాయ కార్మికులు అనేక చోట్ల ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్నారని, వారికి హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. సొంత భూములు కలిగిన రైతులు చాలామంది పట్టాదారు పాస్‌పుస్తకాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారసత్వంగా భూమి పొందిన వారికి కూడా పాస్‌పుస్తకాలు మంజూరు చేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. భూములు ఆన్‌లైన్ చేయకపోవడం వల్ల ఎంతో మంది రైతులు ప్రభుత్వ రాయితీలు కోల్పోతున్నారన్నారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో పొరపాట్లను సరిదిద్దాలని సూచించారు. ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న పేదలకు నివేశన స్థలాలపై హక్కులు కల్పించేలా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్‌కు అర్జీలు వెల్లువెత్తుతున్నాయంటే రెవెన్యూ యంత్రాంగం ఏ స్థాయిలో పనిచేస్తోందో అర్థం అవుతోందన్నారు. సీపీఎం మండల కార్యదర్శి సూరిని స్వామిరెడ్డి మాట్లాడుతూ.. పచ్చిమిర్చి రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా వ్యాపారులు మోసం చేస్తున్నారని మండిపడ్డారు. పచ్చిమిర్చి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పట్టపు ప్రకాశం, చలపతి రెడ్డి, యానాది తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ మృతికి నివాళి

ఒంగోలు సిటీ: నాగులుప్పలపాడు మండల పరిధిలోని అమ్మనబ్రోలుకు చెందిన సెంట్రల్ బ్యాంకు మాజీ డైరెక్టర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఉన్నం శ్రీనివాసులు ఇటీవల మృతి చెందారు. గురువారం ఆయన దశదిన కర్మకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకరబాబు, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, మాజీ చైర్మన్ బంగారు బాబు, మండల పార్టీ అధ్యక్షుడు పోలవరపు శ్రీమన్నారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు నలమలపు కృష్ణారెడ్డి హాజరయ్యారు. శ్రీనివాసులు చిత్రపటానికి ఘన నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.


ఉన్నం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బూచేపల్లి, చుండూరి

బడి బయట పిల్లలను బడుల్లో చేర్పించాలి


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగలక్ష్మి

సంతనూతలపాడు:

బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని వేములపాడు సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.నాగలక్ష్మి అన్నారు. మండలంలోని చిలకపాడు, చంద్రపాలెం గ్రామాల్లో గురువారం జరిగిన కిషోరి వికాస కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. 11 నుంచి 18 ఏళ్లలోపు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు, గ్రామస్తులు చర్యలు తీసుకోవాలన్నారు. బాల కార్మిక వ్యవస్థకు దూరంగా ఉంచాలని సూచించారు. ఈ సందర్భంగా కిశోర బాలికలు, తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు.

మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న ప్రభుత్వాలు


కరపత్రాలు పంచి పెడుతున్న సీపీఎం నాయకులు

ఒంగోలు టౌన్: ప్రజల మధ్య సామరస్యాన్ని దెబ్బతీస్తున్న మతోన్మాదాన్ని ప్రభుత్వాలు ప్రోత్సహించడం దుర్మార్గమని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు విమర్శించారు. గురువారం నగరంలోని అద్దంకి బస్టాండ్ సెంటర్లో మున్సిపల్ వర్కర్స్ మస్టర్ పాయింట్ వద్ద పార్టీ ప్రచారంలో భాగంగా రెండో రోజు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మతం పేరుతో ప్రజలను వేరు చేసే ప్రభుత్వ కుట్రలను తిప్పి కొట్టాలని, దేశ సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఏ ఒక్క కులం, మతం వల్లనో దేశం అభివృద్ధి చెందలేదని, అందరి సమష్టి కృషితోనే అది సాధ్యమైందని స్పష్టం చేశారు. స్వాతంత్ర్య పోరాటంలో అన్ని మతాల ప్రాతినిధ్యం ఉందని గుర్తు చేశారు. ప్రజల్లో అనైక్యత వల్ల దేశాభివృద్ధి కుంటు పడుతోందని తెలిపారు. ప్రజల్లో వైషమ్యాలను సృష్టించేందుకు కొన్ని రాజకీయ పార్టీలు చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జి.రమేష్, దామా శ్రీనివాసరావు, తంబి శ్రీనివాసరావు, కొర్నపాటి శ్రీనివాసరావు, జి.ఆదిలక్ష్మి, బీవీ రావు తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

నాగులుప్పలపాడు:

మండలంలోని పోతవరం గ్రామంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోనికి తీసుకొని వారి వద్ద నుంచి రూ.2,160 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. దాడుల్లో కానిస్టేబుల్ తిరుపతిరెడ్డి, హోంగార్డు శివ పాల్గొన్నారు.

సర్వేకు అందరూ సహకరించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ జ్యోతి

మద్దిపాడు: మండలంలో నిర్వహిస్తున్న సర్వేలకు సచివాలయ సిబ్బంది సహకరించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ వి.జ్యోతి మండలస్థాయి అధికారులను కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులకు, మండల స్థాయి అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సచివాలయాల్లో పనిచేసే సిబ్బంది మొత్తం వివిధ కారణాలు చెబుతూ సెలవులు తీసుకుంటున్నారని, దీని వల్ల సర్వేలు నిర్వహించడం కష్టతరంగా మారిందన్నారు. పెన్షన్ల పంపిణీ సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ సిబ్బందికి సెలవులు ఇవ్వవద్దని అధికారులను కోరారు. సచివాలయ కార్యదర్శులు సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. వివిధ శాఖల అధికారులు తమ తమ సిబ్బందికి సెలవు మంజూరు చేసే క్రమంలో కార్యదర్శుల సంతకం ఉంటేనే సెలవు ఇవ్వాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఓ కె.రమేష్‌బాబు, ఈఓపీఆర్డీ రఘుబాబు, పంచాయతీరాజ్ ఏఈ రవికుమార్, ఎస్ఐ బి.శివరామయ్య, డిప్యూటీ తహసీల్దార్ బి.అజయ్‌కుమార్ రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ చెన్నారెడ్డి, సీహెచ్ఓ రజితకుమారి, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కండి


శిక్షణలో మాట్లాడుతున్న ఉపవిద్యాశాఖధికారి చంద్రమౌళీశ్వర్

సంతనూతలపాడు:

పాఠశాలల అభివృద్ధిలో పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు భాగస్వాములు కావాలని ఒంగోలు ఉప విద్యాశాఖాధికారి ఏ చంద్రమౌళీశ్వర్ అన్నారు. మండల కేంద్రంలోని ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఒంగోలు ఉపవిద్యాశాఖాధికారి ఏ.చంద్రమౌళీశ్వర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి బయట పిల్లలను గుర్తించి వారిని పాఠశాలలలో చేర్పించడం, పాఠశాలలకు అవసరమైన ఆర్థిక వనరులు సమకూర్చడం, నాణ్యమైన విద్య అందేలా చూడడం కోసం కృషి చేయాలని తెలిపారు. అనంతరం పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. శిక్షణకు మండలంలోని ఒక్కో పాఠశాల నుంచి ఒక టీచర్, ఒక ఎస్ఎంసీ సభ్యుడు హాజరయ్యారు. మండలంలోని మొత్తం 46 ప్రభుత్వ పాఠశాలలు పాల్గొన్నాయి. కార్యక్రమంలో ఆయన వెంట మండల విద్యాశాఖాధికారి డి.వెంకారెడ్డి, రిసోర్స్ పర్సన్స్ స్వప్నరాజు, శ్రీనివాసరావు, గుణప్రసాద్ పాల్గొన్నారు.

నిరుపేదలకు శివాజీ ట్రస్ట్ ఆర్థిక సాయం


విద్యార్థులకు చెక్ అందజేస్తున్న రాయపాటి వెంకటేశ్వర్లు

ఒంగోలు సిటీ: ఒంగోలు నగరంలోని ముక్తినూతలపాడులో వెంకట శివాజీ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం 15 మంది పేద విద్యార్థులు, వృద్ధులకు రూ.2.50 లక్షలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు, శివాజీ టుబాకోస్ అధినేత రాయపాటి వెంకటేశ్వర్లు, రాయపాటి శివాజీ మాట్లాడుతూ.. ఏటా తమ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ రచయిత పాటిబండ్ల ఆనందరావు హాజరయ్యారు. కార్యక్రమంలో త్రోవగుంట మాజీ సర్పంచ్ కట్టా సింగయ్య, రాయపాటి అంకయ్య, హెచ్ఎం బత్తిన సుధాకర్‌రావు, ఎంఈఓ మేకల రామాంజనేయులు, మాజీ ప్రిన్సిపాల్ ఐనంపూడి వెంకట నరసింహం, ఒంగోలు బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ మేనేజర్ మార్నేని సుబ్రహ్మణ్యం, అడ్వకేట్ కొమ్మనబోయిన పిచ్చయ్య, రాయపాటి నాగేశ్వరరావు, రాయపాటి సీమోను పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శ్రీవారి ఆస్థానం


చతుర్వేద పారాయణంలో ఆలయ అర్చకులు

ఒంగోలు మెట్రో: శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని గురువారం సాయంత్రం ఒంగోలులోని శ్రీగిరి వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారి ఆస్థానం కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు శ్రీవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. నాద నీరాజనం, చతుర్వేద పారాయణం, విష్ణు సహస్ర నామ పారాయణం సామూహికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, కార్య నిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వర రావు, ఆలూరు లక్ష్మీ కుమారి తదితరులు పర్యవేక్షించారు. భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

చీమకుర్తి రూరల్: మండలంలోని కేవీ అగ్రహారం ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వెంకటేశ్వర స్వామి, పద్మావతి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి 18వ రోజు ధనుర్మాస పూజలు చేశారు. కార్యక్రమంలో పూజారులు రవి, రవిరామానుజచార్యులు పూజలు నిర్వహించారు. శిద్దా హనుమంతరావు దంపతులు శిద్దా ప్రసాదు, గుర్రం దామోదరరావు, పి.శ్రీను, కిరణ్, పి.ప్రసాద్, ఎంపీటీసీ యన్నం విజయలక్ష్మి శేషురెడ్డి, నూనె శివ దంపతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు పంపిణీ


విద్యార్థులకు బహుమతులిస్తున్న హెచ్ఎం శ్రీదేవి, కోటేశ్వరరావు

కొత్తపట్నం: స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన గణితంలో ముగ్గుల పోటీ నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థినులకు బహుమతులను హెచ్ఎం మన్నం శ్రీదేవి, గణిత ఉపాధ్యాయుడు చక్కా కోటేశ్వరరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయతో పాటు 51 మంది విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధుసూదన్‌రావు, ఎస్వీ రమేష్, సుబ్రహ్మణ్యం, కోటేశ్వరరావు, అన్నపూర్ణ, సాయికిషోర్, నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఏకేయూ వీసీకి శుభాకాంక్షలు

ఒంగోలు సిటీ: ఆంధ్రకేసరి యూనివర్శిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తిని స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వీసీకి, వర్శిటీ అధికారులకు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం డాక్టర్ శ్రీనివాసరెడ్డి, పి.యామిని అమ్మాజీ, ఎం.శ్రీనివాసులు, కె.వెంకటేశ్వరనాయక్, సీహెచ్ వెంకటేశ్వర్లు, జె.ఎన్.సురేష్‌కుమార్, ఎం.హేమ తదితరులు పాల్గొన్నారు.


వీసీ మూర్తికి శుభాకాంక్షలు చెబుతున్న ప్రిన్సిపాల్ కళ్యాణి

విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేత


విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న కెనరా బ్యాంక్ ప్రతినిధులు

సంతనూతలపాడు: మండలంలోని మంగమూరు, కామేపల్లివారిపాలెం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంగమూరు కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో సుమారు 100 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న బ్యాంక్ ఒంగోలు రీజనల్ మేనేజర్ కె.కిషోర్ రెడ్డి, మంగమూరు కెనరా బ్యాంక్ మేనేజర్ డి.అశ్విత్ విద్యార్థులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పి. వెంకటేశ్వర్ రెడ్డి, సీహెచ్ నరసింహారావు, వి.రంగారావు, రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.